నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 19 నవంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి

- రామగుండం సీపీ శ్రీనివాస్

వాహనదారుడి వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీపీ శ్రీనివాస్

కోటపల్లి, నవంబర్ 18: ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కోటపల్లి మండలం రాపన్‌మల్లి వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును సోమవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెక్ పోస్టు వద్ద ఉన్న పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అక్రమంగా తరలిస్తున్న డబ్బు, మద్యం, బంగారంతో పాటు ప్రజలను ప్రలోభాలకు గురి చేసే విలువైన వస్తువులను పట్టుకోని సీజ్ చేయాలన్నారు. ఆయన వెంట మంచిర్యాల డీసీపీ భాస్కర్,అడిషనల్ డీసీపీ రాజు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, ఎస్ఐ సుబ్బారావు, వెంకటకృష్ణ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడిగా శ్రీనాథ్

నియామక పత్రాన్ని అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, నవంబర్ 18 : బీఆర్ఎస్వీ బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా ఈదునూరి శ్రీనాథ్ నియామకమయ్యారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల ప్రవణ్‌కు నియామక పత్రాన్ని అందించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ విప్ బాల్క సుమన్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ఆదేశాల మేరకు శ్రీనాథ్‌ను నియామకం చేసినట్లు పేర్కొన్నారు. నాయకులు పార్టీ పటిష్టానికి కృషి చేయాలని చిన్నయ్య సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు ఆడెపు అరుణ్‌ప్రసాద్ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి పదవికి నోట్ల కట్టలు!

మంచిర్యాల నుంచి మహారాష్ట్ర ఎన్నికలకు డబ్బు లు!

- ఓ మంత్రి క్యాంపెయిన్ చేస్తున్న సెగ్మెంట్లు చూసుకుంటానని ఓ ఎమ్మెల్యే హామీ
- ప్రతిఫలంగా మంత్రి పదవి కోసం పట్టు
- ఆయనకు ఇస్తే ఇవ్వండి.. నాకు పదవి కావాల్సిందే.. అని మరో ఎమ్మెల్యే
- మంచిర్యాల జిల్లాలో హాట్ టాపిక్‌గా మారిన వ్యవహారం

మంచిర్యాల, నవంబర్ 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒక ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇచ్చే వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతున్నది. నిన్న, మొన్నటి వరకు మంచిర్యాల నుంచి మంత్రి అవ్వడానికి పోటీ పడుతున్న ఎమ్మెల్యేలను కాదని పక్కా జిల్లాకు చెందిన మరో ఎమ్మెల్యేకు పదవి ఇస్తారని ఆ పార్టీ నాయకులే చెప్పుకొచ్చారు. తాజాగా మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో కొత్తవాదన తెరపైకి వచ్చింది. మంచిర్యాల జిల్లా నుంచి గెలిచిన ఎమ్మెల్యేలలో బాగా డబ్బులున్న ఓ ఎమ్మెల్యే మహారాష్ట్ర ఎన్నికల కోసం వందల కోట్లు దారాదత్తం చేస్తున్నారట. ప్రతి ఫలంగా ఆయన మంత్రి పదవి కోసం పట్టుపడుతున్నారని మరో ఎమ్మెల్యే వర్గం నాయకులు ప్రచారం చేస్తున్నారు. 'మా సార్‌కు పైసలు లేవు. పార్టీ కోసం కష్టపడ్డాడు. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని నిలబెట్టిండు. న్యాయంగా చూసుకుంటే మా ఎమ్మెల్యేకు తప్ప మరొకరికి మంత్రి పదవి ఇవ్వొద్దు. కానీ.. ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చి బాగా డబ్బున్న ఎమ్మెల్యే పదవి కోసం కోట్లు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. మా సార్‌కు పదవి రాకపోతే ఏం చేసుడో అర్థమైతలేదు' అని ఆ నాయకులు వాపోతున్నారు. అందుకే మహారాష్ట్రలో ఎన్నికలైతే మన జిల్లాలో హడావుడి కనిపిస్తుందన్నారు. అన్ని వాహనాలు, అంత మందిని ఎన్నికల కోసం తీసుకుపోతున్నారంటే.. దానికి కారణం ఆ నోట్ల కట్టలు కట్టే ఎమ్మెల్యే హస్తం ఉందని మరో ఎమ్మెల్యే అనుచరులు ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడు మంచిర్యాల జిల్లాలో ఈ వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది.

ఓ మంత్రి ప్రచారం చేస్తే నియోజకవర్గాల్లో ఖర్చు

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణకు చెందిన ఓ మంత్రి స్టార్ క్యాంపెనయిర్‌గా ఉండి ప్రచారం చేస్తున్న నియోజకవర్గాల్లో సదరు ఎమ్మెల్యే ఇస్తున్న డబ్బులు ఖర్చు చేస్తున్నట్లు కాంగ్రెస్ లీడర్లే చెప్తున్నరు. డబ్బులు ఇక్కడి నుంచి తీసుకుపోకుండా మహారాష్ట్రలో తనకున్న పరిశ్రమలు, వ్యాపార సముదాయాల నుంచే ఈ డబ్బులు అప్పగిస్తున్నారని ఆ నాయకులు ఆరోపిస్తున్నరు. ఆ మంత్రి ప్రచారం చేస్తే నియోజకవర్గాల్లో డబ్బుల పంపిణీ బాధ్యత కూడా సదరు ఎమ్మెల్యేనే తీసుకున్నారని చెప్తున్నరు. మంచిర్యాల జిల్లాకు చెందిన ఎమ్మెల్యే ఇస్తున్న కోట్ల రూపాయలు, పక్క రాష్ట్రంలో పెడుతున్న ఖర్చు గురించి పార్టీలో 'ముఖ్య'మైన నాయకుడు అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లడం ఆయనకే మంత్రి పదవి కట్టబెట్టేందుకు సిద్ధమవుతున్నారని జిల్లాలోని కాంగ్రెస్ లీడర్లు చెప్తున్నారు. పార్టీ కోసం తెలంగాణలో పని చేసిన ఎమ్మెల్యేను కాదని పక్క రాష్ట్రం ఎన్నికల్లో డబ్బులు కుమ్మరించే వారికి పదవి ఇవ్వడం వెనుక మతలబేంటని ప్రశ్నిస్తున్నారు. కాగా.. ఈ విషయం తెలిసిన మా సార్ కూడా వెళ్లి అధిష్టానాన్ని కలిశారని చెప్తున్నారు. డబ్బులున్న బడా లీడర్‌కు మంత్రి పదవి ఇస్తే ఇచ్చుకోండి. పార్టీ కోసం కష్టపడిన నాకు మంత్రి పదవి ఇవ్వాల్సిందే అంటూ స్పష్టంగా చెప్పి వచ్చారట. కాకపోతే ఒకే జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇవ్వడం కుదరదని అధిష్టానం చెప్పినట్లు సమాచారం. అదే జరిగితే ఇన్ని రోజులు జిల్లా కాంగ్రెస్‌లో నివురుగప్పిన నిప్పులా ఉన్న అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరుతాయనడంలో సందేహం లేదు.

ఎటూ తేల్చని అధిష్టానం

మంత్రి పదవి విషయంలో రోజుకో ప్రచారం జిల్లాలో జోరుగా సాగుతుంటే.. కాంగ్రెస్ అధిష్టానం ఊరించి ఉసూరుమనిపిస్తుందే తప్పా ఎవరు మంత్రి అన్న విషయంలో క్లారిటీ ఇవ్వడం లేదు. దీంతో హస్తం పార్టీ క్షేత్రస్థాయిలోని కార్యకర్తలు నారాజ్ అవుతున్నరు. ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య నలిగిపోతున్నరు. మంత్రి పదవి ఆశించి భంగపడుతున్న ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితంగా ఉండే నాయకులే ఈ విషయంపై తీవ్రమైన చర్చ లేపుతున్నారు. ఇలా చేస్తేనైనా అధిష్టానం వరకు విషయం వెళ్లి కష్టపడిన వారిని గుర్తిస్తుందో ఏమోనని ఆశపడుతున్నారు. లేకపోతే మంత్రి పదవి విషయంలోనే ఇలా చేసిన పార్టీ రేపు లోకల్ బాడీ ఎన్నికల్లోనూ ఇదే చేస్తే మా పరిస్థితి ఏంటని హైరానా పడుతున్నారు. మంత్రి పదవి ఒకరి దగ్గరుండి, జిల్లా అధ్యక్ష పదవి ఒకరి దగ్గర ఉంటే స్థానిక ఎన్నికల్లో మాకు కష్టాలు తప్పవని అందోళన చెందుతున్నరు. ఒకరు టికెట్ ఇస్తే మరొకరు క్యాన్సల్ చేయరని నమ్మకం ఏంటని.. ఈ ఇద్దరి మధ్య మేం నలిగిపోక తప్పదని వాపోతున్నరు. మరి ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటుందా. మంత్రి పదవి విషయంలో సాధ్యమైనంత త్వరగా ఏదో ఒకటి తేలుస్తుందా? ఇద్దరు ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఇస్తుందా? లేకపోతే జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలుగా చీలిపోతుంటే చూస్తూ మిన్నకుండి పోతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

ఆసిఫాబాద్‌లోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ముగిసిన గ్రూప్-3 పరీక్ష

ఎగ్జామ్ సెంటర్లను సందర్శించిన కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేశ్ ధోత్రే, సీపీ శ్రీనివాస్

నస్పూర్/మంచిర్యాల అర్బన్/సీసీసీ నస్పూర్/ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్/, నవంబరు 18 : గ్రూప్-3 పరీక్ష సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మంచిర్యాల జిల్లాలో 48 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఆఖరి రోజు 8,185 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌బీహెచ్‌వీ, ఎస్ఆర్‌డీజీ పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాలను కలెక్టర్ కుమార్ దీపక్ సందర్శించారు. మంచిర్యాల ఆర్‌బీహెచ్‌వీ, సీసీసీ నస్పూర్ సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాల, సీసీసీ నస్పూర్‌లోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్, సింగరేణి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాలను రామగుండం సీపీ శ్రీనివాస్, మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీ ప్రకాశ్‌తో కలిసి పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఆయాచోట్ల గ్రూప్-3 నోడల్ అధికారి, అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, మంచిర్యాల డీసీపీ భాస్కర్, మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్ రావు, రూరల్ సీఐ అశోక్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ నరేశ్, ఎస్ఐలు పాల్గొన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పరిశీలించారు. జిల్లాలో మొత్తం 18 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 4471 మంది అభ్యర్థులకుగాను.. 2757 మంది హాజరయ్యారయ్యారని ఆయన తెలిపారు. ఆసిఫాబాద్‌లోని పీటీజీ బాలుర గురుకుల పాఠశాల, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను నోడల్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ పరిశీలించారు. ప్రాంతీయ సమన్వయకర్త లక్ష్మీనరసింహ, రూట్ అధికారులు, ముఖ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

హాజీపూర్ : పోలీసులకు జవాబు పత్రాలను అందజేస్తున్న సిబ్బంది

నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్ ఆక్స్‌ఫర్డ్ పాఠశాల వద్ద బందోబస్తు పరిశీలిస్తున్నసీపీ

గూడెంలో కార్తీక సందడి

దండేపల్లి, నవంబర్18 : దండేపల్లి మండలంలోని గూడెం రమాసహిత ఆలయంలో సోమవారం కార్తీక మాసం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు ముందుగా పవిత్ర గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. నదిలో కార్తీక దీపాలు వదిలి, గంగమ్మ తల్లికి పూజలు చేశారు. అనంతరం గుట్ట కింద భాగంలో రావి చెట్టు వద్ద, గుట్ట పైన గల ధ్వజస్తంభం వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. 314 జంటలు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించాయి. అనంతరం అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

కెరమెరి అడవుల్లోకి పులి

- ఆవాసం కోసం సంచారం
- ఫారెస్ట్‌లో పర్యటించిన జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

పులి సంచారం ఉన్న ప్రాంతాలను పర్యటించి.. అటవీ సిబ్బందికి సూచనలు జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రియాల్

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ) : కొద్ది రోజుల క్రితం మహారాష్ట్ర నుంచి ప్రవేశించిన పులి కెరమెరి, తిర్యాణితో పాటు ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూర్, ఉట్నూర్ అడవుల్లో సంచరిస్తున్నది. కెరమెరి మండలం జోడేఘాట్ రేంజ్‌పరిధిలో తిరుగుతున్నట్లు సోమవారం అటవీ శాఖ అధికారులు గుర్తించారు. రెండు రోజులు క్రితం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం చాందూరి, హస్నాపూర్ ప్రాంతాల్లో పర్యటించిన పులి కెరమెరి రేంజ్ పరిధిలోకి వచ్చి ఉండవచ్చని భావిస్తున్నారు.

ఆవాసం దొరకక..

దాదాపు మూడు నెలలుగా ఆసిఫాబాద్, కెరమెరి, తిర్యాణి అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్న పులి ఆవాసం దొరకక సంచరిస్తున్నదని అటవీ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఇప్పటికే ఉన్న సుమారు 10 పులులు స్థిర నివాసం ఏర్పరుచుకున్నాయి. ఇటీవల మహారాష్ట్ర అటవీ ప్రాంతం నుంచి వచ్చిన పులి ఆవాసం కోసం తిరుగుతున్నది. ఆగస్టు చివరి వారంలో కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్ అటవీ ప్రాంతంలో సంచరించిన పులి .. ఆపై ఆసిఫాబాద్ మండలం గుండి, గోవిందాపూర్ అటవీ ప్రాంతంలో పర్యటించింది. చిర్రకుంట సమీపంలో ఓ ఆవుపై దాడి చేసింది. పులి ఆచూకీ కోసం రంగంలోకి దిగిన అటవీ అధికారులు జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న అడవులతో పాటు కెరమెరి, తిర్యాణి అటవీ ప్రాంతాల్లో ప్రత్యేక బృందాల ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు. చివరి సారిగా పరందోళి, దేవాపూర్, బోరిలాల్‌గూడ అడవుల్లో సంచరించినట్లుగా గుర్తించారు. కానీ ఆ తర్వాత ఆ పులి ఎక్కడికి వెళ్లిందనేది తెలియరాలేదు. గత నాలుగు రోజులుగా ఆదిలాబాద్ జిల్లాలో మళ్లీ పులి సంచారం కనిపించింది. రెండు రోజుల క్రితం ఉట్నూర్ మండలంలోని అటవీసమీపంలోని గ్రామాల్లో పర్యటించిన పులి పశువులపై దాడిచేసింది. తాజాగా సోమవారం కెరమెరి అడవుల్లో సంచరించినట్లు అటవీ అధికారులు గుర్తించారు. జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్ అటవీ ప్రాంతంలో పర్యటించి క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒంటరిగా వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లవద్దని, పశువులను మేత కోసం అటవీ ప్రాంతాల్లోకి తోలుకెళ్లవద్దని హెచ్చరించారు. పులి కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని, దానికి ఎలాంటి అపాయం తలపెట్టవద్దని కోరారు.

మెరుగైన సేవలతోనే వికసిత భారత్‌కు పునాది

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల (ఏసీసీ), నవంబర్ 18: గ్రామీణ స్థాయిలోని సహకార సంఘాల సభ్యులకు నాణ్యమైన సేవలందించినప్పుడే వికసిత భారత్‌కు పునాది ఏర్పడుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక యూనివర్సల్ అర్బన్ బ్యాంక్‌లో నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం.. నూతనంగా సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి, అత్యంత ప్రాధాన్యత రంగంగా గుర్తించిందని పేర్కొన్నారు. పరస్పర సహకారంతో సంఘాలు ప్రగతి పథంలో పయనించాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రగతి కనబర్చిన సంఘాలకు జ్ఞాపికలు అందజేశారు. మరో అతిథి సంజీవ రెడ్డి మాట్లాడుతూ అన్ని రకాల సేవలను అందించేందుకు సహకార శాఖ సిద్ధంగా ఉందన్నారు. గోదాం, భూములు, పెట్రోల్ బంక్ వంటివి అందించేందుకు అనుకూలంగా ఉన్నామని, ఈ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళా సంఘాలకు సోలార్ పరిశ్రమలు, క్యాంటీన్స్ తదితర వాటిని ఏర్పాటు చేయుటకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. విశిష్ట కాకతీయ సహకార శిక్షణ కేంద్రం వరంగల్ ప్రిన్సిపల్ లూనవత్ యాకుబ్ నాయక్ సహకార వారోత్సవాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం బాగా పనిచేసిన సంఘాలకు తెలంగాణ సహకార యూనియన్ హైదరాబాద్ తరపున బహుమతులు అందించారు. బ్యాంక్ చైర్మన్ వినయ్ కుమార్ అధ్యక్షత వహించిన బ్యాంక్ సీఈవో మూర్తి, సహకార శాఖ అధికారులు కే.రవీందర్ రావు, మల్లారెడ్డి, హన్మంత్ రెడ్డి, రవికిశోర్, సందీప్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్లు, కార్యదర్శులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

ఎస్టీపీపీలో మిథనాల్ ప్లాంట్

రోజుకు 500 కేజీల కార్బన్‌డయాక్సైడ్ నుంచి 180 కేజీల మిథనాల్ తయారీకి రంగం సిద్ధం

జైపూర్, నవంబర్ 18 : పర్యావరణహిత చర్యలకు పెట్టింది పేరుగా ఉన్న సింగరేణి సంస్థ.. మరో వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. కార్బన్‌డయాక్సైడ్ వాయువు నుంచి మిథనాల్ వాయువును ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నది. జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్‌కేంద్రంలో బొగ్గు మండించగా వెలువడే వాయువు నుంచి రోజుకు 500 కిలోల పరిమాణం గల కార్బన్‌డయాక్సైడ్‌ను సేకరించి మిథనాల్ ద్రవాన్ని ఉత్పత్తి చేయనున్నది. ఈ ప్లాంట్ నిర్మాణం ఇప్పటికే ప్రారంభం కాగా, డిసెంబర్ 31 నాటికి పూర్తవుతుందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం పేర్కొన్నారు. ప్రయోగం అనంతరం రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. సింగరేణి విద్యుత్ కేంద్రంలో బొగ్గు మండించగా వచ్చే కార్బన్ ఉద్గారాలను 99.9 శాతం వరకు వాతావరణంలో కలవకుండా నివారించడంకోసం ఈఎస్‌పీ (ఎలక్ట్రో స్టాటిక్ ప్రెసిపిటేటర్స్) నెలకొల్పడం జరిగిందన్నారు. థర్మల్ పవర్‌ప్లాంట్ చిమ్నీకి అనుబంధంగా ఈ ప్రయోగాత్మకప్లాంట్ నిర్మాణం జరుగుతుందన్నారు. ఇప్పటికే సివిల్ నిర్మాణాల్లో కార్బన్‌డయాక్సైడ్‌ను సంగ్రహించే యూనిట్, హైడ్రోజన్ జనరేటర్, కంప్రెషర్ యూనిట్, మిథనాల్ డిస్టిలేషన్ యూనిట్‌లు పూర్తయినట్లు పేర్కొన్నారు.

వ్యాపార ప్రయోజనాలు

ప్లాంట్ ప్రారంభం తర్వాత ప్రతి రోజూ 180 కేజీల మిథనాల్‌ను తయారీ చేస్తారు. మిథనాల్‌ను ఎరువులు, అక్రిలిక్ ప్లాస్టిక్, సింథటిక్ ఫైబర్ వస్త్రాల తయారీలో వినియోగించనున్నారు. వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా పెద్ద ఎత్తున ప్లాంట్‌ను ఏర్పాటు చేసి మిథనాల్‌ను వివిధ పరిశ్రమలకు అమ్ముకొని లాభాలు గడించవచ్చని యాజమాన్యం యోచిస్తుంది. ఈ మేరకు ఎస్టీపీపీ వేదికగా అధికారులు ప్రయోగానికి సిద్ధమవుతున్నారు. ఇది విజయవంతమైతే సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు విద్యుత్, మిథనాల్ ఉత్పత్తితో లాభాలు గడించే అవకాశం ఉంది.

జైపూర్ ఎస్టీపీపీలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ప్లాంట్